క్లుప్తంగా

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక


మహేష్‌బాబు, మోహన్‌రెడ్డి

బంగారుపాళెం: యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా రామమూర్తి, అధ్యక్షుడిగా మహేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా మోహనరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా బాలాజీ, అమూల్య, కోశాధికారిగా డి.బాలాజి, కార్యదర్శులుగా ఆదిలక్ష్మి, చెంగయ్య, వెంకటరమణ, పార్వతి, సోనీ సుమలతతోపాటు జిల్లా కార్యదర్శులుగా మొగిలయ్య, ధనుంజయ ఎన్నికయ్యారు.

నేడు భద్రకాళమ్మ ఆలయంలో ఉత్సవం

గుడిపాల: మండలంలో నరహరిపేట చెక్‌పోస్ట్ సమీపంలోని భద్రకాళమ్మ దేవాలయంలో శనివారం 46వ సంవత్సర ఉత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలియజేశారు. ఉదయం 10.30 గంటలకు యజ్ఞం నిర్వహిస్తామని, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు చెప్పారు. పశుమంద గ్రామానికి చెందిన నిర్మల, రమేష్ బాబు కుటుంబసభ్యులు యజ్ఞం, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

సబ్ రిజిస్ట్రార్‌కు వీడ్కోలు


సర్వేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

బంగారుపాళెం: పుంగనూరుకు బదిలీపై వెళుతున్న సబ్ రిజిస్ట్రార్ సర్వేశ్వర్‌రెడ్డికి శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్ల సంఘం మండల అధ్యక్షుడు బస్సా నాగరాజగౌడ్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌లాల్, కోశాధికారి సుజాత, సభ్యులు పద్మనాభపిళ్లై, సురేష్, ప్రసాద్, రాజా, శివ, అభిరామ్, నరేష్, స్టాంప్‌వెండర్స్ దేవేంద్రశెట్టి, దినేష్, లక్ష్మీకాంత్, ఈశ్వర్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిన స్వర్ణాంధ్ర–2047 పోస్టర్లను శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సుమిత్ కుమార్ ఆవిష్కరించారు. ఈ పోస్టర్లలోని అంశాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఏలు గురజాల జగన్‌మోహన్, థామస్, మురళీ మోహన్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అధికారులు



బాధ్యతలు స్వీకరిస్తున్న సబ్ రిజిస్ట్రార్ యోగానంద్, ఏఈ హేమచంద్రుడు

బంగారుపాళెం: సబ్ రిజిస్ట్రార్‌గా యోగానంద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు అభినందనలు తెలిపారు.

ఏఈగా హేమచంద్రుడు

ట్రాన్స్‌కో ఏఈగా హేమచంద్రుడు బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ నుంచి బదిలీపై వెళుతున్న ఏఈ తనికవేల్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు.

● శాంతి హోమం



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం ప్రాయశ్చిత్త శాంతిహోమం నిర్వహించారు. దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం ఆధ్వర్యంలో దేవస్థాన వేదపండితులతో ఈ హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

● పవిత్రోత్సవాలు

గంగవరం: మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయ వార్షిక పవిత్రోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో వేదపండితులు స్వామివారికి ఆరాధన, పుణ్యాహవచనం ఇత్యాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణతో స్వామివారికి పూజా కైంకర్యాలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. హోమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పడకేసిన పారిశుద్ధ్యం

- అపరిశుభ్రంగా పల్లెలు
- చెత్తాచెదారాలతో రహదారులు
- మురుగుతో నిండిన కాలువలు
- విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని అధికారులు


జోడిచింత రోడ్డులో డంపింగ్ యార్డ్


పూతలపట్టులో చెత్తాచెదారాలతో నిండిన మురుగునీటి కాలువ

పూతలపట్టు: నియోజకవర్గంలోని పల్లెల్లో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. గ్రామంలోకి అడుగు పెట్టగానే చెత్తాచెదారాలే స్వాగతం పలుకుతున్నాయి. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు పంచాయతీలు పాడుపడిన ఇళ్లలా మారిపోయాయని ఆరోపించిన టీడీపీ నేతలు ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. పూతలపట్టులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న కాలువ వ్యర్థాలతో నిండిపోయి మురుగు కదలడం లేదు. దోమలకు ఆవాసంగా మారింది. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే తేనేపల్లె పంచాయతీ పరిధిలోని రంగంపేట క్రాస్ నుంచి బాటగంగమ్మకు వెళ్లే హై వే రోడ్డు పక్కన డంపింగ్ యార్డును తలపించేలా చెత్తతో నిండిపోయింది. దుర్వాసన కారణంగా ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. యాదమరి మండలంలోని జోడిచింతల చెక్‌పోస్ట్ వద్ద పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కనే జంతువుల వ్యర్థాలు పడేస్తున్నారు. దీనిపై పలుమార్లు పత్రికలో కథనాలు ప్రచురించినా అధికారులు స్పందించడం లేదు. ఈ క్రమంలోనే గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీల నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ప్రస్తుతం ఉన్న కాలువలు చిన్నపాటి వర్షానికే పొంగిపొర్లుతున్నాయి. దీంతో వీధులు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పల్లె సీమలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని గ్రామీణులు కోరుతున్నారు.


తేనేపల్లెలో రోడ్డు పక్కనే చెత్త

రెగ్యులర్‌గా శానిటేషన్

గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమం రెగ్యులర్‌గా కొనసాగుతోంది. మంగళవారం, శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించి, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయాలని కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. గ్రీన్ అంబాసిడర్లు కూడా ప్రతిరోజు పనిచేస్తున్నారు. ఎక్కడైనా పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకుంటే మా దృష్టికి తీసుకురావాలి.
–శ్రీనివాసులు, ఈఓపీఆర్‌డీ, పూతలపట్టు మండలం

నేడు వరదరాజస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నేతల పూజలు

ఐరాల: మండలంలోని కాణిపాకం ఆలయ అనుసంధానమైన శ్రీవరదరాజస్వామి గుడిలో శనివారం ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తిరుమల శ్రీవారి లడ్డూపై విషప్రచారం చేస్తున్న కూటమి నేతలకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామి అంటూ పూజలు జరిపించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

భూ రికార్డుల పరిశీలన


మాట్లాడుతున్న ఆర్‌డీఓ చిన్నయ్య

తవణంపల్లె: తహసీల్దార్ కార్యాలయంలో భూ రికార్డులను ఆర్‌డీఓ చిన్నయ్య శుక్రవారం పరిశీలించారు. భూముల రికార్డులను పరిశీలించారు. మండలంలో 72 ఎకరాల అసైన్డ్‌మెంట్ భూములను ఫ్రీ హోల్డ్ సంబంధించిన ఫైలును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే మత్యం, చిగరాకులపల్లె పోలింగ్ బూత్‌ల విభజనకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. తహసీల్దార్ సుధాకర్, భూ రీసర్వే డీటీ వెంకటరమణ పాల్గొన్నారు.

జెడ్పీ పీఎఫ్ ఖాతాలను క్రమబద్ధీకరించరూ!

–సీఈఓకు యూటీఎఫ్ నాయకుల వినతి


జెడ్పీ సీఈఓకు సమస్యలను నివేదిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ భవిష్యనిధి ఖాతాలను సత్వరమే క్రమబద్ధీకరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో సీఈఓ రవికుమార్‌నాయుడును కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పీఎఫ్ ఖాతాల నెలవారీ వివరాలు అందుబాటులో ఉంచాలని, పెండింగ్‌లో పీఎఫ్ వడ్డీని జమచేయాలని విజ్ఞప్తి చేశారు. పలువురు ఉపాధ్యాయులు బదిలీ, ఉద్యోగోన్నతి పొందారని, వారి పాఠశాల చిరునామాలను పీఎఫ్ ఖాతాలో మార్పు చేయాలన్నారు. అలాగే నామినీ పేర్లను కూడా మార్చుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. అంతర్ జిల్లా బదిలీలపై వచ్చిన ఉపాధ్యాయల పీఎఫ్ ఖాతాలను ఆన్‌లైన్ ద్వారా ప్రదర్శనకు పెట్టాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఫైనల్ పేమెంట్‌లను చెల్లించాలని, కారుణ్య నియామకాలకు పూనుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, నాయకులు సుధాకర్ రెడ్డి, రెహానా బేగం పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీర్ బాధ్యతల స్వీకరణ


వెంకటరామిరెడ్డి

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బి.వెంకటరామిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీలలో చిత్తూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న గోమతిని తిరుపతికి.. అక్కడ నుంచి వెంకటరామి రెడ్డిని చిత్తూరుకు బదిలీ చేశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎంఈ మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఉద్యోగులు, కార్మికులు నూతన ఎంఈని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన అధికారులు


కలెక్టర్‌ను కలిసిన ఐసీడీఎస్ పీడీ హైమావతి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వివిధ శాఖల అధికారులు శుక్రవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవికుమార్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి, ఏపీఐఐసీ జెడ్ఎం వెంకట సుబ్బారావు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌కుమార్ కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పశు వైద్యశాల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్

గుడిపాల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్య జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం బొమ్మసముద్రం పశు వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో పశువులకు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను ప్రతి పశువుకూ వేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ రవితేజ, సిబ్బంది కిషోర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి భవనం



చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి భవనం సిద్ధమవుతోంది. తాత్కలికంగా కార్యాలయ నిర్వహణకు నగరంలోని పాత ఆర్‌డీఓ కార్యాలయం భవనాన్ని ఎంపిక చేశారు. ఈ మేరకు అనుమతులు రావడంతో భవనానికి రంగులు వేస్తున్నారు. అక్టోబర్ 3వ తేదీన ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు చేసినట్లు తెలిసింది.

ఎన్‌సీసీకి 27 మంది ఎంపిక



ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులు

గుడిపాల: ఎన్ఎస్ఎస్‌కు 27మంది ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ 35వ బెటాలియన్ నాయక్ సుబేదార్ రాకేష్ లాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక సీఎన్ఆర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్‌కు క్యాడెట్ల ఎంపిక నిర్వహించారు. 70మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి ఫిజికల్ టెస్ట్, రన్నింగ్ రేస్ మొదలైవి నిర్వహించి 27మందిని ఎంపిక చేశారు. అనంతరం నాయక్ సుబేదార్ మాట్లాడారు. ఎన్‌సీసీతో దేశభక్తి,, జాతీయ భావం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. శిక్షణ పొందిన వారికి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, పోలీస్ శాఖలో నియామకానికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ లోకేష్, 35వ ఆంధ్రబెటాలియన్ సీఈఓ కల్నల్ మోనిష్, హవల్దార్ మొగిలినాయుడు, ప్రిన్సిపల్ రామచంద్ర, ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఆఫీసర్ హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

వార్డు స్థాయిలో ‘మన ఇల్లు–మన గౌరవం


పాల్గొన్న సచివాలయ కార్యదర్శులు, మాట్లాడుతున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్: హౌసింగ్‌కు సంబంధించి వార్డు సచివాలయం స్థాయిలో ‘మన ఇల్లు–మన గౌరవం’ కార్యక్రమాన్ని నిర్వహించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.నరసింహప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం లేఔట్లలో హౌసింగ్ పురోగతిపై హౌసింగ్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులతో కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ.. హౌసింగ్ లబ్ధిదారులతో వార్డు సచివాలయంలో అడ్మిన్ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడానికి వీలుగా తాపీ మేస్త్రీలను అనుసంధానం చేయడం, మెటీరియల్ సరఫరా చేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు స్టేజ్ కన్వర్షన్ చేయించాలన్నారు. రోజువారీగా లేఔట్లను సందర్శించి, లబ్ధిదారులను సమన్వయం చేసుకుని లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ వెంకటరామిరెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీధర్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ‘ఫ్యామిలీ డాక్టర్’


కిల్లారిపల్లెలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: మండలంలోని కిల్లారిపల్లె, రాసనపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 125 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బొమ్మసముద్రం, గుడిపాల పీహెచ్‌సీ డాక్టర్లు సంధ్య, అనూష, వైద్య సిబ్బంది శిరీష, ఉమామహేశ్వరి, మల్లిక, చంద్ర, విజయమ్మ, సునీత, అనిత పాల్గొన్నారు.

ఆర్డీఓ బదిలీ

పలమనేరు: పలమనేరు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన్ను జీఏడీ సెక్రటరీ టు గవర్నమెంట్(పొలిటికల్) వద్ద రిపోర్ట్ చేయాలని చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ నుంచి ఆదేశాలందాయి. అలాగే పలమనేరు ఆర్డీఓగా ఇప్పటిదాకా పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి వద్ద ఓఎస్‌డీగా ఉన్న వెంకటేష్‌ను ఇక్కడికి ఆర్డీఓగా బదిలీ చేశారు. అర్‌డీఓగా బదిలీ చేశారు.


ఇరుముడితో తరలివచ్చిన భక్తులు

గణేష్ భక్తుల ఇరుముడి సమర్పణ

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారికి శుక్రవారం గణేష్ దీక్ష చేపట్టిన భక్తులు ఇరుముడి సమర్పించుకున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 75 మంది భక్తులు దీక్ష చేపట్టారు. సమయం తీరడంతో వారు ఇరుముడి చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఉభయకర్తలు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ గురుప్రసాద్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతికం





కాణిపాకం: వరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక ప్రత్యేక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో వేదిక సందడిగా కనిపించింది. కళాకారులు తమదైన శైలిలో ఇచ్చిన ప్రదర్శనలు తన్మయత్వం చెందారు. ప్రధానంగా కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. గీతాలాపన, పౌరాణిక నాటిక ప్రదర్శన రంజింపచేశాయి.

